క్లుప్తంగా

ఘనంగా సుదర్శన నారసింహ హోమం

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో శుక్రవారం సుదర్శన నారసింహ హోమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. కాకినాడకు చెందిన శ్రీ రంగ రామానుజ జీయర్‌స్వామి ఆశ్రమ వేద పండితులు శ్రీమాన్ విష్ణు, మాధవన్, శ్రీధర్ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ శరగడం రామేశ్వరరావు, కార్యదర్శి గొట్టిముక్కల ఆనంద బీహారీలాల్, మాజీ ఎంపీ ఆడారి మంజు, సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, అబ్బాయినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మునగపాక: తమ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతో పాటు వైర్లు సరిచేయాలని కోరుతూ శుక్రవారం సంబంధిత అధికారులకు పేటకట్టు మూల సంఘ రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు ఆడారి మహేష్ మాట్లాడుతూ పేటకట్టు సంఘ పరిధిలోని విద్యుత్ స్తంభాలు పలు చోట్ల ఒరిగిపోయాయని, వైర్లు వేలాడుతున్నాయని, ఈ కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మళ్ల సంజీవరావు, బొడ్డేడ సోమరాజు, గంగునాయుడు, రాజు, నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బాధ్యతగా పని చేయాలి



తోటాడ హైస్కూల్‌లో మాట్లాడుతున్న డీఈవో అప్పారావు నాయుడు

మునగపాక: మండలంలోని తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌తో పాటు నారాయుడుపాలెం ఎంపీపీ స్కూల్‌ను శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు వారంలో 32 గంటలు తప్పనిసరిగా పని చేయాలన్నారు. చదువులో వెనుకబడిన వారిని గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం తీరుతెన్నులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, హెచ్‌ఎంలు రామలక్ష్మి, నాగ కుమారి, సీఆర్‌ఎంటీలు ఎం.గోవింద, కర్రి లక్ష్మీనారాయణ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ అందాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: అన్నదాత సుఖీభవ పథకం అందరికీ అందేలా చూడాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలు, వీఏఏలతో సమావేశమయ్యారు. అన్నదాత సుఖీభవ పథకం శనివారం ప్రారంభమవుతుందన్నారు. మండలవ్యాప్తంగా 8897 మంది రైతులను ఈ పథకానికి అర్హులుగా గుర్తించారన్నారు. మరి కొంత మంది రైతులు ఎన్‌పీసీఐ లింక్ చేసుకోకపోవడం, ఆధార్ అనుసంధానం లేక అవకాశం కోల్పోయారన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయన శుక్రవారం రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావుతో కలిసి మునగపాకలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీల మండల అధ్యక్షులు పెంటకోట విజయ్, టెక్కలి పరశురామ్, పార్టీ నేతలు కర్రి సాయికృష్ణ, దొడ్డి శ్రీను, ఆడారి మంజు, ఏవీ సత్యనారాయణ, దాడి మునిలినాయుడు, ఆడారి శ్రీకాంత్, ఇన్‌చార్జి ఎంపీడీవో సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

మునగపాక: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు కోరారు. డీఆర్‌డీఏ ద్వారా మునగపాక సాయిగణేష్ స్వయం సహాయక సంఘ సభ్యురాలు పాలమరశెట్టి దీపా మహాలక్ష్మికి రూ.50 వేల విలువ గల ఎగ్‌కార్టు బండిని శుక్ర వారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు ఆడారి మంజు, కర్రి సాయికృష్ణ, పెంటకోట విజయ్, టెక్కలి పరశురామ్, దొడ్డి శ్రీను, భీమరశెట్టి శ్రీను, బొడ్డేడ అప్పలనాయుడు, ఏవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మూలపేటలో దోమల మందు పిచికారీ

మునగపాక: మూలపేటలో దోమల బెడద లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన పంచాయతీ కార్యదర్శి గంగాధర్‌తో కలిసి దోమల మందు పిచికారీ చేయించారు. ప్రజలు గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.

శ్రమయేవ జయతే

- శ్రమదానంతో రోడ్లు నిర్మించుకుంటున్న జగనన్న కాలనీ లబ్ధిదారులు
- రోడ్లు నిర్మిస్తామని మొహం చాటేసిన కూటమి ప్రభుత్వం



సైతారుపేటలో విరాళాలు సేకరించి రోడ్డు నిర్మాణానికి తారు గ్రావెల్ వేస్తున్న దృశ్యం



నిర్మాణానికి నోచుకోని కొరుప్రోలు జగనన్న కాలనీ రోడ్డు



వర్షం కురిసి బురదమయంగా మారిన సైతారుపేట జగనన్నకాలనీ రోడ్డును శ్రమదానంతో చదును చేసుకుంటున్న కాలనీవాసులు

ఎస్.రాయవరం: జగనన్న కాలనీల్లో కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో కాలనీవాసులు విరాళాలు సేకరించుకుని శ్రమదానంతో తాత్కాలిక రోడ్లు నిర్మించుకుంటున్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలో పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి వాటి నిర్మాణానికి నిధులు అందజేశారు. అలా జగనన్న కాలనీలు రూపుదిద్దుకున్నాయి. ఆ కాలనీల్లో కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలు చేపట్టడంలేదు. దీంతో కొన్ని గ్రామాల్లోని లబ్ధిదారులు చందాలు పోగు చేసుకుని రోడ్ల నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ కొనుగోలు చేశారు. శ్రమదానంతో రహదారి నిర్మాణానికి నడుం బిగించారు.

వర్షం నీటితో ఇబ్బందులు..

కొన్ని జగనన్న కాలనీ రోడ్లలో వర్షం నీరు నిలిచిపోవడం వల్ల బురదమయంగా మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ కారణం వల్లే తాము రోడ్లు వేసుకోవాల్సి వస్తుందని కాలనీవాసులు చెబుతున్నారు. ఈ సమస్య ఎక్కువగా సైతారుపేట, కొరుప్రోలు, దార్లపూడి, పేటసూదిపురం, జేవీపాలెం, సర్వసిద్ధి, రామయ్యపట్నం తదితర గ్రామాల్లో నెలకొని ఉంది.

శ్రమదానంతో రోడ్లు వేసుకుంటున్నాం..



జగనన్న కాలనీలకు రోడ్డు సదుపాయం లేదు. గత ఏడాదే ఇళ్ల నిర్మాణాలు పూర్తయి వాటిలోనే నివసిస్తున్నాం కూడా. అయినా కూటమి ప్రభుత్వం మా కాలనీల వైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. అందుకే చందాలు వేసుకుని శ్రమదానంతో తాత్కాలిక రోడ్లు వేసుకుంటున్నాం.

– తుమ్మపాల సత్తిబాబు, జగనన్న కాలనీ లబ్ధిదారు, సైతారుపేట

ఏ అధికారి మా కాలనీలకు రాలేదు..



జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్నాం. ఇళ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత రోడ్లు వేస్తారనుకున్నాం. ఈ లోగా ప్రభుత్వం మారింది. అప్పటి నుంచి ఏ అధికారి మా కాలనీలకు రాలేదు. గతుకులున్న చోట వర్షపునీరు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నాం. సొంతంగా రోడ్డు నిర్మించుకుంటున్నాం.

– కర్ణుడు, కొరుప్రోలు

సమస్యలుంటే అధికారులకు నివేదిస్తాం..



జగనన్న కాలనీలకు పూర్తి స్థాయిలో లేఅవుట్లు, రోడ్లకు అవసరమయిన స్థలాలు కేటాయించాం. అప్పట్లో గృహ నిర్మాణ శాఖ సదుపాయాల కల్పనకు, రోడ్ల చదునుకు నిధులు కేటాయించింది. సమస్యాత్మకంగా ఉన్న చోట పంచాయతీల నుంచి నిర్మాణాలు చేపట్టాలి. మా దృష్టికి వచ్చిన సమస్యలు జిల్లా అధికారులకు నివేదిస్తాం.

– జి.రమేష్‌బాబు, తహసీల్దార్, ఎస్.రాయవరం మండలం

తల్లిపాలు అమృత సమానం



రాట్నాలపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కోటవురట్ల: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యప్రదాయిని అని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హైమావతి అన్నారు. రాట్నాలపాలెం-1 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. కేంద్రంలో తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించి అవగాహన కల్పిస్తూ మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు కచ్చితంగా పట్టాలన్నారు. తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధకంగా పని చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎం.ఎస్తేరురాణి, సీహెచ్ లక్ష్మి, కె.రాణి, బి.అప్పలనర్స, పి.గంగ, పి.లక్ష్మి, ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయురాలు ఎ.ఎస్.కుమారి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

గణపర్తి గ్రామంలో.. : మునగపాక: తల్లిపాలు పిల్లలకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ తెలిపారు. మండలంలోని చూచుకొండ పీహెచ్‌సీ పరిధిలోని గణపర్తి గ్రామంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవ ర్యాలీతో పాటు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దలు కాళ్ల చంద్రమోహన్, మారిశెట్టి వెంకటరమణ, ఆడారి సాంబమూర్తి, హెచ్‌వీ బేగం, ఏఎన్‌ఎం సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్ఠం..

అచ్యుతాపురం రూరల్ : నవజాత శిశువులకు తల్లిపాలు శ్రేష్ఠమని అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.శ్రావ్య అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను ప్రజలందరికీ అర్థమయ్యేలా ఐసీడీసీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించనున్నట్లు వైద్యాధికారి శ్రావ్య తెలిపారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.సుహాసిని, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు సత్య, పద్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు నగల బహూకరణ



మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామంలోని దుర్గాలమ్మకు 15 తులాల వెండి తాడు, శతమానంను శుక్రవారం విశాఖకు చెందిన కోరుబిల్లి కొండ వెంకట్రావు, లక్ష్మి, కోరుబిల్లి హరికృష్ణ ప్రసాదు, సుధారాణి బహూకరించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోలమరశెట్టి చిట్టినాయుడు, లక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

సంతోషిమాతకు ప్రత్యేక కుంకుమ పూజలు



మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్ లోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రెండో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం



బి.కె.పల్లిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. ఐవీఆర్‌ఎస్ గ్రామం బి.కె.పల్లిలో ఆయన శుక్రవారం ఉదయం పర్యటించారు. గడప గడపకు వెళ్లి పారిశుధ్య అంశాలు పరిశీలించారు. డ్రైనేజీలు, మురుగు కాలువలను శుభ్రం చేయించారు. చెత్త తొలగింపజేసి బ్లీచింగ్ చల్లించారు. స్వచ్ఛ గ్రామాల కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, ఈవోపీఆర్డీ రఘురాం పాల్గొన్నారు.

శిథిల భవనం వరండాలో ఔషధాలు



శిథిల భవనం వరండాలో పడి ఉన్న ఔషధాలు

పాయకరావుపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఉపయోగించాల్సిన సిరప్‌లు బయట పడేశారు. 2026 వరకు కాల పరిమితి ఉన్న దగ్గు, జలుబు, జ్వరానికి వాడాల్సిన చంటిపిల్లల సిరప్‌ల ప్యాకెట్లు పీహెచ్‌సీ ఆవరణలోని శిథిలమైన భవనం వరండాలో కనిపించాయి. ఈ విషయమై పీహెచ్‌సీ వైద్యాధికారి సుభాష్‌ను సంప్రదించగా 104 సిబ్బంది నక్కపల్లి మండలం గొడిచర్ల పీహెచ్‌సీకి వాటిని తరలించేందుకు అక్కడ ఉంచారన్నారు. 104 సిబ్బంది డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను సంప్రదించగా సిరప్‌లను తీసుకెళ్లడంలో జాప్యం జరిగిందని, ఇటుపై అలా జరగకుండా జాగ్రత్త వహిస్తామన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ

దేవరాపల్లి: మండలంలోని తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. సిరీ ఫౌండేషన్ సభ్యులు ఎస్.బాబూరావు, ఎల్.వి.నారాయణరావు సహకారంతో స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం వి.ఎస్.ఎస్.వి.ప్రసాద్, ఉపాధ్యాయుల చేతుల మీదుగా ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు పెద్దాడ వెంకటరమణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన

మునగపాక: స్థానికంగా నూతనంగా నిర్మించనున్న సత్తెమ్మతల్లి గుడి ఏర్పాటు పనులకు సంబంధించి స్థల పరిశీలన శుక్రవారం చేపట్టారు. ఈ నెల 6వ తేదీన ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించనున్న నేపథ్యంలో అందుకు అవసరమయ్యే చర్యలపై రైతులు సమావేశమయ్యారు. ఆలయ నిర్మాణం ఎక్కడ చేపట్టాలనే వివరాలను వేదపండితులు రైతులకు వివరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు దాడి చంద్రరావు, కార్యదర్శి వెలగా అప్పలనాయుడు, రైతులు కర్రి రామజోగినాయుడు, బొడ్డేడ అప్పలనాయుడు, వెలగా వెంకటప్పారావు, దాడి వెంకటరావు, వెలగా ధర్మసూరి, వెలగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

యలమంచిలి రూరల్: నియోజకవర్గంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ 'కార్యక్రమం శనివారం జరగనుంది. యలమంచిలి మండలం ఏటికొప్పాకలో ఉదయం 9.30 గంటలకు నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పార్టీ యలమంచిలి పట్టణ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర తెలిపారు. పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని కోరారు.

దుర్గాదేవి ఆలయంలో శ్రావణం పూజలు

యలమంచిలి రూరల్: శ్రావణ శుక్రవారం సందర్భంగా యలమంచిలి మండలం పద్మనాభరాజుపేట గ్రామంలో గుర్గాదేవి అమ్మవారి ఆలయానికి మహిళలు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన హరిభజన ఆకట్టుకుంది.

రోగులకు పాలు, పండ్లు పంపిణీ



పీహెచ్‌సీలో రోగులకు పళ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పాయకరావుపేట: స్థానికంగా ఉన్న పీహెచ్‌సీలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు లంక సూర్యానారాయణ, సర్పంచ్‌లు గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, పన్నీరు బాబ్జీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, పంచాయతీ వార్డు మెంబర్లు, కొప్పిశెట్టి మోహన్, పిరాది రాజు, తుమ్మలపల్లి సతీష్, అన్నవరం దేవస్థానం మాజీ డైరెక్టర్ దోమాడ సుందరరావు, ఎస్. నర్సాపురం గ్రామ శాఖ అధ్యక్షులు పల్లేల కృష్ణార్జునరావు, పల్లేల వెంకట్, కేశనకుర్తి సత్తిబాబు, నెలపర్తి నాగరాజు, ఎంఎస్‌పేట ఎంపీటీసీ సభ్యుడు కొంతం నరేష్, పోసిన వీరబాబు, పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి కె.కె.ఆర్.ఎస్. లత, బొడ్డా శ్రీదేవి, అడపా శ్రావణి, పులి సీతారత్నం, కొంతం వరలక్ష్మి, బెందుర్తి రమణ తదితరులు పాల్గొన్నారు.

బార్క్ నిర్వాసితుల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బార్క్ నిర్వాసితులు

అచ్యుతాపురం రూరల్ : బార్క్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని రావిపాలెం, దోసూరు, దొప్పెర్ల గ్రామాల రైతులు శుక్రవారం అనకాపల్లి ఆర్‌డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బార్క్ నిర్వాసితులకు జిరాయితీ భూములతో సమానంగా, డీ పట్టా భూములకు రూ.60 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు రూ.25 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలన్నారు. నిర్వాసిత కుటుంబాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.25 లక్షలు ఆర్‌ఆర్ ప్యాకేజ్ వర్తింపజేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కోజెడ్పీటీసీ నర్మాల కుమార్, రైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీపీఎం కన్వీనర్ రొంగలి రాము, నిర్వాసిత నాయకులు కొల్లి వరహాలు, మండల నూకరాజు, ఈగల రాజు, తారుమూరు గోపి, మర్ర లోవ, కనితి సన్యాసిరావు, పైల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు



ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గం

యలమంచిలి రూరల్: స్థానిక ఎన్జీవో హోంలో శుక్రవారం యలమంచిలి తాలూకా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సంఘం కోశాధికారి కె. సత్యారావు పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికలో అధ్యక్షునిగా చంద్రమౌళి సోమేశ్వర్రావు, గౌరవ అధ్యక్షునిగా కె. వందనం, అసోసియేట్ అధ్యక్షునిగా కేఎస్ సన్యాసిరావు, జనరల్ సెక్రటరీగా జి. సాంబమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి. చిట్టిబాబు, కోశాధికారిగా కె. కామేశ్వర్రావు, ఉపాధ్యక్షులుగా బి. నరసింహమూర్తి, ఏపీ జగన్నాథం, ఎన్. సూర్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా వి. లక్ష్మణరావు, జి. సత్యనారాయణ, ఎస్ఎన్ఎస్ మణి, 20 మంది కార్యవర్గ సభ్యులు నూతన కార్యవర్గంలో ఉన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధ్యక్షుడు సోమేశ్వర్రావు తెలిపారు.

తపాలా సేవలు వినియోగించుకోండి



రాంబిల్లిలో తపాలా మేళా నిర్వహిస్తున్న దృశ్యం

రాంబిల్లి (అచ్యుతాపురం): గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ తపాలా కార్యాలయాల్లో ఖాతాలు కలిగి ఉండాలని యలమంచిలి డివిజనల్ పోస్టల్ ఇన్స్‌పెక్టర్ ఎల్.నాయుడు సూచించారు. రాంబిల్లిలో స్థానిక పోస్ట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో తపాలా మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన సంక్షేమ పథకాల నిధులు తపాలా శాఖలో జమ అవుతున్నందున ప్రతి ఒక్కరూ తపాలా ఖాతాలు తెరవాలని సూచించారు. బ్రాంచ్ పోస్ట్ మేనేజర్ జగన్నాథరాజు, శివ, కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ



లోగో ఆవిష్కరిస్తున్న రోటరాక్ట్ బృందం

పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాలలో రోటరాక్టు క్లబ్స్ ఆఫ్ యంగ్ లీడర్స్ అండ్ సబల డిస్ట్రిక్ట్ 3020 నూతన కార్యవర్గం శుక్రవారం బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. రోటరాక్టర్లు చంద్రవర్ధన్, అనురాధ అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.కళ్యాణ్ చక్రవర్తి, గౌరవ అతిథులుగా డిస్ట్రిక్ట్ కమిటీ కో చైర్మన్ నాగ సురేష్, డిస్ట్రిక్ట్ రోటరాక్ట్ రిప్రజెంటేటివ్ కృష్ణ కేదారశెట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాల్లో మమేకమవ్వాలనే ఈ రోటరాక్టు క్లబ్‌లను ప్రోత్సాహిస్తున్నామని తెలిపారు. గత సంవత్సరం శ్రీ ప్రకాష్ రోటరాక్టు క్లబ్ ద్వారా పోలియో నిర్మూలనకు లక్ష రూపాయలు విరాళమివ్వడం రోటరాక్టు సభ్యుల సేవానిరతికి ప్రతిబింబమని తెలిపారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగిరెడ్డి, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అగని అక్రమ గ్రావెల్ తరలింపు



గ్రావెల్ తవ్విన ప్రదేశాన్ని చూపుతున్న సీపీఎం నాయకుడు

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు డి-పట్టా భూముల్లో అక్రమంగా గ్రావెల్ తరలించుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకుడు ఎం.సత్యనారాయణ ఆరోపించారు. గ్రామంలో సర్వే నంబర్ 513లో 6 నుంచి 13 వరకు ఉన్న భూముల్లో నిత్యం గ్రావెల్ తరలించుకుపోతున్నారన్నారు. రాజకీయ నాయకుల అండదండలతో జరుగుతున్న ఈ వైనంపై అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవన్నారు.

ఎగ్ కార్ట్‌తో డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి



ఎగ్ కార్ట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట: డ్వాక్రా మహిళలకు ఎగ్ కార్ట్ ఏర్పాటుకు రూ.50 వేల సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. కశింకోటలో డ్వాక్రా మహిళలకు మంజూరు చేసిన ఎగ్ కార్ట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్టు ఏర్పాటుకు రూ.35 వేలు, గుడ్లతో వివిధ రకాల వంటకాలు తయారు చేసేందుకు అవసరమైన రూ.15 వేల విలువైన వస్తు సామగ్రిని ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. వీటి ద్వారా నెలకు రూ.20 వేల వరకు ఆదాయం సమకూరుతుందని అధికారులు పేర్కొంటున్నారన్నారు. కోడి గుడ్ల వాడకాన్ని పెంచేందుకు నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (నెక్)తో సెర్ప్ అధికారులు ఒప్పందం చేసుకున్నారని, దీనిలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి మందికి ఎగ్ కార్టులను అందించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందన్నారు.

పింఛన్ల పంపిణీ..

కశింకోటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రామకృష్ణ ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి సుభాషిణి, డిప్యూటీ ఎంపీడీవో ధర్మారావు, ఏపీఎం నడిపూడి పార్వతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వీరజ్యోతి

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం, వేములపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వీరజ్యోతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో జరుగుతున్న ప్రసవాలు ఆరా తీశారు. ప్రసవాల సంఖ్య పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుత సీజనల్ జ్వరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో ఉన్న హాస్టల్స్ విధిగా సందర్శించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం బాలుర వసతిగృహాన్ని సందర్శించి, అక్కడ పిల్లలతో మాట్లాడారు. విద్యార్థులు తాగేందుకు వేడినీటిని అందించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఎంపీహెచ్‌వో నాగేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ మల్లిబాబు ఉన్నారు.